సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం : 30 : జనవరి : 2024




విశాఖకు రాహుల్ ద్రవిడ్

గోపాలపట్నం: భారత్ క్రికెట్ జట్టు కోచ్ రాహుల్ ద్రవిడ్ సోమవారం ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకున్నారు.



ఎన్నికలకు సహకరించాలి

ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని పోలీసులు కోరారు. పలు గ్రామాలను వారు సందర్శించారు. 8లో



రికార్డు ఉత్పత్తి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్ట్రక్చరల్ మిల్ విభాగంలో సెక్షన్ రౌండ్ 80 ఎం.ఎం 2,434 టన్నుల రికార్డు స్థాయి ఉత్పత్తి జరిగింది.

న్యూస్‌రీల్

డీఐజీగా విశాల్ గున్ని



విశాల్ గున్ని



ధీరజ్



జగదీష్

సాక్షి పాడేరు: రాష్ట్రవ్యాప్తంగా భారీ ఎత్తున ఐపీఎస్‌ల బదిలీలు జరిగాయి. విశాఖ రేంజ్ డీఐజీగా విశాల్ గున్ని నియమితులయ్యారు. ప్రస్తుత విశాఖ రేంజ్ ఐజీ హరికృష్ణను డీజీపీ కార్యాలయానికి బదిలీ చేశారు. రంపచోడవరం ఏఎస్పీగా పనిచేస్తున్న ఎ.జగదీష్‌ను పాడేరుకు, పాడేరు ఏఎస్పీగా పనిచేస్తున్న కె.ధీరజ్‌ను రంపచోడవరానికి బదిలీ చేశారు. ఈమేరకు సోమవారం చీఫ్ సెక్రెటరీ కె.ఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

నిరుద్యోగ యువతకు టెక్నికల్ ట్రైనింగ్




ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు వివిధ రంగాల్లో సాంకేతిక శిక్షణ ఇవ్వనున్నట్టు పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సోమవారం తెలిపారు. ఇంటర్ పాసైన అభ్యర్థులకు చింతపల్లిలో ఫ్రంట్ లైన్ ఆఫీస్ అసోసియేట్స్, 8వ తరగతి పాసైన అభ్యర్థులకు అరకువేలిలో ఎలక్ట్రీషియన్, టెన్త్ పాసైన అభ్యర్థులకు పాడేరులో డేటా ఎంట్రీ ఆపరేటర్, 8వ తరగతి పాసైన అభ్యర్థులకు పాడేరులో లైట్ మోటర్ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో వచ్చేనెల 7వ తేదీలోగా దరఖాస్తులు అందజేయాలన్నారు. శిక్షణ పర్యవేక్షణ కోసం ఎం.సతీష్‌కుమార్‌ను ప్లేస్‌మెంట్ అధికారిగా నియమించినట్టు తెలిపారు. ఐటీడీఏ ఉచితంగా అందిస్తున్న ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పీవో సూచించారు. మరిన్ని వివరాలకు 93983 38105 అనే నంబర్‌లో సంప్రదించాలన్నారు.

విశాఖ-కిరండూల్ రైలుకు మరో విస్టాడోమ్ కోచ్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం-కిరండూల్ రైలుకు ఫిబ్రవరి, మార్చి నెలల్లో మరో విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి తెలిపారు. విశాఖలో బయల్దేరే విశాఖపట్నం-కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్ రైలుకు ఫిబ్రవరి 2, 3, 4, 9, 10, 11, 16, 17, 18, 23, 24, 25 మార్చి 1, 2, 3, 8, 9, 10, 15, 16, 17, 22, 23, 24, 29, 30, 31వ తేదీల్లోను, కిరండూల్‌లో బయల్దేరే కిరండూల్-విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ రైలుకు ఫిబ్రవరి 3, 4, 5, 10, 11, 12, 17, 18, 19, 24, 25, 26, మార్చి 2, 3, 4, 9, 10, 11, 16, 17, 18, 23, 24, 25, 30, 31 ఏప్రిల్ 1వ తేదీల్లో మరో విస్టాడోమ్ కోచ్‌ను జతచేస్తున్నట్లు పేర్కొన్నారు. మరింత మంది ప్రయాణికులు ఈ సదుపాయాన్ని వినియోగించుకుని అరకు అందాలను అద్దాల కోచ్‌ల నుంచి వీక్షించవచ్చన్నారు.

ఐటీడీఏ స్పందనకు 61 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న పీవో, సబ్ కలెక్టర్

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏ సమావేశం హాలులో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 61 అర్జీలు వచ్చాయి. రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్‌తో కలిసి పీవో సూరజ్‌గనోరే గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు.

- రబ్బరు ప్లాంటేషన్ కోసం మొక్కలు సరఫరా చేయాలని మారేడుమిల్లి మండలం వేటుకూరు పంచాయతీ పరిధిలోని 200 మంది గిరిజన రైతులు సర్పంచ్ ఈతపల్లి మల్లేశ్వరితో కలిసి అర్జీ అందజేశారు.
- హైవే నిర్మాణం కారణంగా నష్టపోయిన బాధితులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాలని, కొత్త కరెంటు మీటర్లు ఏర్పాటు చేయాలని, ఐదు కేజీల గ్యాస్ సిలిండర్లు మంజూరు చేయాలని రంపచోడవరం మండలం వెలమలకోట గ్రామస్తులు కోరారు.
- హైవే నిర్మాణం కారణంగా చిన్న అడ్డపల్లి, పెద్ద అడ్డపల్లి గ్రామాల్లో వాటర్ ట్యాంకులు తొలగించారని, కొత్త వాటిని నిర్మించాలని గ్రామస్తులు కోరారు.
- చవిటిదిబ్బలు-పందిరిమామిడి రోడ్డులో పది కిలోమీటర్ల మేర అటవీ అభ్యంతరాలు తొలగించాలని సర్పంచ్‌లు అన్నిక పండమ్మ, చిలకల విజయశాంతి, సూరిబాబుతో పలువురు గిరిజనులు పీవోను కోరారు.
- చెరువుపాలెంలో ఇంటింటికీ కుళాయిలు ద్వారా నీటి సరఫరా చేయాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీ డి.ఎస్.శాస్త్రి, డీడీ అబ్బులాం, ఈఈ డేవిడ్‌రాజు, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, ఏడీఎంహెచ్‌వో ప్రకాశం, సీడీపీవో సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా రబీ

- ఆశాజనకంగా వరి నారుమడులు
- వరినాట్లు ప్రారంభం
- రబీలో వరి విస్తీర్ణం 2,361 హెక్టార్లు
- అత్యధికంగా దేవీపట్నంలో 551 హెక్టార్లలో సాగు



వరినాట్లు వేస్తున్న గిరిజనులు



పాడేరు మండలం వంతాడపల్లిలో వరినారును సేకరిస్తున్న గిరిజన మహిళలు

సాక్షి,పాడేరు: జిల్లాలో రబీ సాగు జోరందుకుంది. నారుమడులు ఆశాజనకంగా ఎదుగుతుండడంతో వరినాట్లను రైతులు ప్రారంభించారు. 22 మండలాల పరిధిలో నీటి నిల్వలు అధికంగా ఉన్న లోతట్టు ప్రాంతాల్లోని 2,361 హెక్టార్లలో ప్రతి ఏడాది రబీలో వరి సాగు చేస్తున్నారు. దేవీపట్నం మండలంలో అత్యధికంగా 551 హెక్టార్లలో వరి సాగుచేస్తారు. గత నెలలో తమ వద్ద ఉన్న సంప్రదాయ వరి విత్తనాలతో లోతట్టు భూముల్లో నారుమడులు వేశారు. పలు ప్రాంతాల్లో దమ్ము పనులు చేపడుతుండగా, మహిళలు నారు సేకరణ, కట్టలు కట్టే పనుల్లో నిమగ్నమయ్యారు. దమ్ము పూర్తయిన చోట వరినాట్లు వేస్తున్నారు. వచ్చేనెల 2వ వారం నాటికి అన్ని ప్రాంతాల్లో రబీ వరినాట్లు పూర్తయ్యే అవకాశం ఉంది. పాడేరు మండలం సలుగు, అయినాడ, దేవీపురం, మినుములూరు, వంతాడపల్లి, వంట్లమామిడి, వనుగుపల్లి పంచాయతీల్లో వరినాట్లు వేయడంలో గిరిజన రైతులు బిజీగా ఉన్నారు. నారు ముదరక ముందే నారుతీసి, సకాలంలో నాట్లు వేయాలని సచివాలయాల పరిధిలోని వ్యవసాయ అసిస్టెంట్లు గిరిజన రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

అనుకూలంగా వాతావరణం

సాగునీరు, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో రబీలో వరిపంట సాగుకు కలిసొచ్చింది. ముంచంగిపుట్టు మండలంలో 158 హెక్టార్లు, పెదబయలులో 216, డుంబ్రిగుడలో 149, అరకులోయలో 91, అనంతగిరిలో 98, హుకుంపేటలో 102, పాడేరులో 175, జి.మాడుగులలో 154, చింతపల్లిలో 51, జీకే వీధిలో 35, కొయ్యూరులో 68, ఎటపాకలో ఒక హెకార్టు, దేవీపట్నంలో 551, వై.రామవరంలో ఒక హెక్టారు, అడ్డతీగల 133, రాజవొమ్మంగిలో 75, గంగవరంలో 255, రంపచోడవరంలో 48 హెక్టార్ల విస్తీర్ణంలో వరిపంట సాగుకు సమాయత్తమయ్యారు.

సకాలంలో వరినాట్లు వేసుకోవాలి



సకాలంలో వరినాట్లు వేసుకోవాలి. నారు ముదిరిపోతే పంట ఎదుగుదల లోపంతో పాటు దిగుబడులు తగ్గే ప్రమాదం ఉంది. వరుస పద్ధతిలో నాట్లు వేసుకోవాలి. వరినాట్ల సమయంలో పంట భూముల్లో నీటి నిల్వలు అధికంగా లేకుండా చూసుకోవాలి. సస్యరక్షణ చర్యల వివరాల కోసం అందుబాటులో ఉన్న వ్యవసాయ అసిస్టెంట్లను సంప్రదించాలి

– ఎస్.బి.ఎస్.నందు, జిల్లా వ్యవసాయాధికారి, పాడేరు

మిరియాల కొనుగోలు లక్ష్యం 100 మెట్రిక్ టన్నులు

- కిలోకు రూ.500 మద్దతు ధర
- కలెక్టర్ సుమిత్ కుమార్



సమావేశానికి హాజరైన అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో గిరిజన రైతుల నుంచి 100 మెట్రిక్ టన్నుల మిరియాలను పాడేరు ఐటీడీఏ ద్వారా కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. పాడేరు డివిజన్‌లోని వ్యవసాయ, ఉద్యానవన, కాఫీ విభాగం అధికారులు, సిబ్బందితో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మండలం నుంచి 10 టన్నులు కొనుగోలు చేయాలని తెలిపారు. మిరియాల పంటను సాగుచేస్తున్న గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా కిలో రూ.500 మద్దతు ధరతో నాణ్యమైన మిరియాలను కొనుగోలు చేస్తామన్నారు. తక్కువ ధరతో దళారీలకు అమ్ముకుని మోసపోకుండా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. మిరియాల ఉత్పత్తిలో గిరిజన రైతులు తగిన నాణ్యత పాటించాలని, ఎండిన మిరియాలలో తేమశాతం తక్కువగా ఉండాలన్నారు. వచ్చేనెల 1వతేదీ నుంచి 15వ తేదీ వరకు కాఫీ లైజన్ వర్కర్లు గ్రామాల్లో పర్యటించి మిరియాల కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. మిరియాల నిల్వలకు గాను గిరిజన రైతులకు ఉచితంగా గోనెసంచులను పంపిణీ చేస్తామన్నారు. 10వేల ఎకరాల్లో కాఫీ తోటల కన్సాలిడేషన్‌కు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు.

మిరియాల నూర్పిడికి యంత్రాల వినియోగం

స్పైసెస్ బోర్డు విస్తరణ అధికారి కల్యాణి మాట్లాడుతూ గిరిజన రైతులు పొదుల నుంచి సేకరించిన మిరియాల నూర్పిడిలో యంత్రపరికరాలను వినియోగించాలన్నారు. కంకుల నుంచి మిరియాలను వేరుచేసేందుకు కాళ్లతో తొక్కడం వల్ల బ్యాక్టీరియా చేరి నాణ్యత తగ్గే పరిస్థితి ఉందన్నారు. పచ్చిమిరియాలను ఒక నిమిషం వేడినీటిలో ముంచి తీసిన తరువాత ఎండబెడితే గింజ నల్లగా ఉండి మంచి ధర వస్తుందని చెప్పారు. తేమ 10 శాతం ఉండేలా చూసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు, కాఫీ ఏడీ అశోక్, కేంద్ర కాఫీబోర్డు డీడీ రమేష్, జిల్లా వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులు నందు, రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీవీటీజీల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి,పాడేరు: పీవీటీజీల సంక్షేమం, సౌకర్యాల కల్పనపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఎంపీడీవోలను ఆదేశించారు. సోమవారం తన కార్యాలయం నుంచి పీవీటీజీల సంక్షేమ కార్యక్రమాలు, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి అన్ని మండలాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పీవీటీజీ కుటుంబాల వద్ద సరైన డాక్యుమెంట్లు లేనందున ప్రభుత్వ పథకాలు పొందేందుకు సాంకేతిక ఇబ్బందులు ఉన్నాయని, ఈమేరకు వారికి అవసరమైన బర్త్, ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని ఆదేశించారు. వారి నివాసాలు, గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని, మరో రెండు నెలల్లో విద్యుత్ సదుపాయం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీలో సక్రమంగా స్పందించని అడ్డతీగల, రాజవొమ్మంగి, గంగవరం ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరేను ఆదేశించారు. కొత్తగా సుమారు 1.13 లక్షల ఆరోగ్యశ్రీ కార్డులు జిల్లాకు వచ్చాయని, వాటిని వెంటనే పంపిణీ చేయాలని ఆదేశించారు. ఐటీడీఏ పీవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించాలని సూచించారు. రానున్న ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రం లేదా పరిసర ప్రాంతంలో ఒక రాత్రి నలుగురు సిబ్బంది బస చేసేందుకు అవకాశాలను పరిశీలించాలని ఎంపీడీవోలను ఆదేశించారు. అయితే ఆ ఇళ్లు రాజకీయ పార్టీల ప్రతినిధులకు చెందినవై ఉండకూడదని తెలిపారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీవోలు అభిషేక్, సూరజ్ గనోరే, చైతన్య, డీఎల్‌డీవోలు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

చలిగాలుల విజృంభణ

- తగ్గిన ఉష్ణోగ్రతలు
- మినుములూరులో 12 డిగ్రీలు, చింతపల్లిలో 12.5, అరకులోయలో 13 డిగ్రీలు నమోదు



పాడేరులో కురుస్తున్న పొగమంచు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా చలిగాలులు విజృంభిస్తున్నాయి. సాయంత్రం నుంచే చలితీవ్రత అధికంగా ఉంటోంది. దీంతో పలువురు చలిమంటలను ఆశ్రయిస్తున్నారు. మరో వైపు పొగమంచు దట్టంగా కురుస్తుండడంతో ఉదయం సమయంలో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వ్యవసాయ పనులు, వారపుసంతలకు వెళ్లే గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. పాడేరు మండలం మినుములూరులో 12 డిగ్రీలు, చింతపల్లిలో 13 డిగ్రీలు, అరకులోయలో 13 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు సోమవారం నమోదైనట్టు అధికారులు తెలిపారు.

పాత టారిఫ్‌లే..

- వరుసగా రెండో ఏడాది విద్యుత్ చార్జీల పెంపు లేనట్లే..
- ఏపీఈఆర్‌సీకి ప్రతిపాదనలు వెల్లడించిన ఈపీడీసీఎల్
- 2024-25 ఆర్థిక సంవత్సరంలోనూ పాత టారిఫ్‌లే అమలు
- విద్యుత్ అమ్మకాలూ గణనీయంగా వృద్ధి
- రెవెన్యూ డిమాండ్‌కు అనుగుణంగా ఆదాయం
- ఐదేళ్ల కాలంలో 116 33/11కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణం



ప్రతిపాదనలు వెల్లడిస్తున్న ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

సాక్షి, విశాఖపట్నం : ప్రతిపక్షాల విమర్శల నోటికి తాళం పడింది. విద్యుత్ చార్జీలు పెంచేస్తున్నారంటూ గగ్గోలు పెట్టి ప్రజల్లో ఆందోళనలు సృష్టించిన పచ్చ మీడియా రాతలకు అర్థం లేకుండా పోయింది. గతేడాది టారిఫ్‌లే 2024-25 ఆర్థిక సంవత్సరంలోనూ అమల్లో ఉంటాయనీ.. వినియోగదారులపై ఎలాంటి చార్జీల భారం మోపడం లేదని ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) స్పష్టం చేసింది. నగరంలో నిర్వహించిన ఏపీఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణలో సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి వివరాలు వెల్లడించారు. విద్యుత్ అమ్మకాలు గణనీయంగా వృద్ధి చెందడం, రెవెన్యూ డిమాండ్‌కు అనుగుణంగా ఆదాయం సమకూరడంతో వినియోగదారులపై భారం మోపకూడదని నిర్ణయించుకున్నట్లు తమ ప్రతిపాదనల్లో స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఈపీడీసీఎల్ పరిధిలో నెట్‌వర్క్ అభివృద్ధికి పటిష్ట ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఏటా ఏప్రిల్ 1 నుంచి కొత్త చార్జీలు అమల్లోకి రావడం ఆనవాయితీ. పేదలు మినహా అన్ని వర్గాల వినియోగదారులపై ఎంతో కొంత పెంపు సాధారణంగా ఉంటుంది. అయితే.. 2023-24లో అనూహ్యంగా ఇంటెన్సివ్ పరిశ్రమలు(ఫెర్రో అల్లాయిస్) మినహా.. ఏ ఒక్క కేటగిరీలోనూ చార్జీలు పెంచాలని డిస్కమ్ ప్రతిపాదించలేదు. ఈసారి కూడా అదే పంథా కొనసాగిస్తూ 2024-25 ఆర్థిక సంవత్సరంలోనూ ఎలాంటి భారం మోపే ఆలోచన లేదంటూ ఏపీఈపీడీసీఎల్ స్పష్టం చేసింది. దీంతో విద్యుత్ వినియోగదారులపై వరుసగా రెండో ఏడాది చార్జీల భారం ఉండదని స్పష్టమైంది. ఈసారి కూడా ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్లు, గ్రీన్ పవర్, రైల్వేలకు సరఫరా చేసే విద్యుత్‌పై మాత్రమే స్వల్ప భారం మోపనున్నట్లు సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఏపీఈఆర్‌సీకి అందించిన ప్రతిపాదనల్లో స్పష్టం చేశారు. గృహ, పారిశ్రామిక, వాణిజ్య, వ్యవసాయం ఏ ఇతర కేటగిరీల్లోనూ పైసా భారం కూడా మోపకపోవడం విశేషం. 2023-24లోనూ ఏ ఒక్క కేటగిరీపైనా భారం మోపలేదు.


'బాబు' బకాయిల పాపాల్ని మోస్తూ...

చంద్రబాబు హయాంలో బకాయిలు చెల్లించకపోవడంతో ఈపీడీసీఎల్‌తో పాటు ఇతర డిస్కంలు నష్టాల్లో కూరుకుపోయాయి. వాటి నుంచి గట్టెక్కించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మొదటి రెండేళ్లు స్వల్పంగా చార్జీలు పెంచాల్సిన పరిస్థితి దాపురించింది. గత టీడీపీ హయాంలో 2014-15 నుంచి 2018-19 వరకూ ప్రభుత్వ సబ్సిడీ కింద రూ.11 వేల కోట్ల వరకూ చెల్లించాల్సి ఉండగా చంద్రబాబు ప్రభుత్వం కేవలం రూ.1,711.22 కోట్లు మాత్రమే చెల్లించి చేతులు దులిపేసుకుంది. వైఎస్ జగన్ ప్రభుత్వం మాత్రం నాలుగేళ్ల కాలంలో ఇప్పటివరకు రూ.9,341.60 కోట్లు చెల్లింపులు చేసింది. అదేవిధంగా విద్యుత్ అమ్మకాల్లోనూ క్రమంగా పుంజుకుంది. 2014-15 నాటికి 13,518 మిలియన్ యూనిట్లు విద్యుత్ విక్రయాలు జరగ్గా.. 2023-24 నాటికి రెండు రెట్లకు పైగా పెరిగి ఏకంగా 27,864 మి.యూనిట్లకు చేరుకుంది. పంపిణీ నష్టాల్ని కూడా క్రమంగా తగ్గించుకుంది. 2014-15 నాటికి 8.45 శాతంగా ఉన్న పంపిణీ నష్టం ప్రస్తుతం 5.98 శాతానికి తగ్గింది. వాణిజ్య పరమైన నష్టాల్లోనూ ఈపీడీసీఎల్ కోలుకుంది. చంద్రబాబు గద్దె దిగే నాటికి 18.31 శాతం ఉండగా.. ప్రస్తుతం కేవలం 9.16 శాతానికి మాత్రమే పరిమితమైంది.

నెట్‌వర్క్ అభివృద్ధికి ప్రణాళికలు

రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఈపీడీసీఎల్ పరిధిలో నాలుగేళ్ల కాలంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం ఏకంగా 116 సబ్‌స్టేషన్లను 33/11 కేవీ సామర్థ్యంతో నిర్మించారు. భవిష్యత్తులో నెట్‌వర్క్ అభివృద్ధికి సుదీర్ఘ ప్రణాళికలు రూపొందించామని సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో ఈపీడీసీఎల్ డైరెక్టర్లు బి.రమేష్ ప్రసాద్, డి.చంద్రం, ఎ.వి.వి.సూర్యప్రతాప్, సంస్థ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ప్రసన్నకుమార్, సీజీఎంలు ఎం.రామకృష్ణ, వి.విజయలలిత, డి.సుమన్ కళ్యాణి, ఒ.సింహాద్రి, అచ్చి రవికుమార్, బి.రామచంద్రప్రసాద్, జె.శ్రీనివాసరావు, ఎం.రవీంద్ర, ఎస్.హరిబాబు, ఎస్ఈ ఎల్.మహేంద్రనాథ్, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నలనల్లని రేడు కొండల్లో కొలువైనాడు



ఐ పోలవరం వద్ద వేంకటేశ్వరస్వామి ఆలయం

చుట్టూ ఎత్తైన కొండలు.. పక్కనే పారుతున్న సీతవాగు.. దాని మీద నుంచి వస్తున్న చల్లని గాలి.. ప్రశాంత వాతావరణంలో ప్రకృతి రమణీయత మధ్య ఐ.పోలవరం కొండల్లో దివ్యమంగళ రూపంలో కనులపండువగా దర్శనమిస్తున్న కోనేటిరాయుడిని చూసినంతనే భక్తులు అలౌకికానందం పొందుతున్నారు. తిరుమలలో తనివి తీరా స్వామిని దర్శించలేని వారు అదే తరహాలో కొలువైన చూడచక్కని శ్రీనివాసుడిని కనులారా కావలసినంత సేపు చూసేందుకు ఇక్కడికి వస్తున్నారు. దీంతో ఈ ఆలయానికి వస్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.

- ఐ.పోలవరంలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి పోటెత్తుతున్న భక్తులు
- రూ.5కోట్లతో ఆలయాన్ని నిర్మించిన టీటీడీ
- మూడు నెలల హుండీ ఆదాయం రూ. 5లక్షలు
- తిరుమలలో మాదిరిగా అన్ని సేవలు



స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులు

రంపచోడవరం: హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం రంపచోడవరం సమీపంలోని ఐ.పోలవరం వద్ద సీతపల్లి వాగు పక్కన కొండపై వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని రూ.5 కోట్ల వ్యయంతో నిర్మించింది. గత ఏడాది మేలో అప్పటి టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి ఆలయాన్ని ప్రారంభించారు. టీటీడీ ప్రధాన అర్చకులు, వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య స్వామివారి విగ్రహ ప్రతిష్ట జరిగింది. తిరుమలలో మాదిరిగానే ఇక్కడ వేంకటేశ్వరస్వామి విగ్రహం ఉండడంతో స్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివస్తున్నారు.

సుప్రభాతం నుంచి ఏకాంత సేవ వరకు...

తిరుమలలో మాదిరిగా ఇక్కడ ప్రతి రోజు స్వామివారికి అన్ని సేవలు నిర్వహిస్తున్నారు. ఉదయం ఆరు గంటలకు సుప్రభాత సేవ మొదలవుతుంది. సుమారు అరగంట పాటు ఈ కార్యక్రమం జరుగుతుంది. అనంతరం ఎనిమిది గంటల వరకు సర్వ దర్శనం. తరువాత ప్రాతః కాల ఆరాధన (మొదటి నైవేద్యం), సహస్రనామార్చన 9.30 వరకు నిర్వహిస్తారు. సర్వదర్శనం 12 గంటల వరకు ఉంటుంది. శుద్ధి, మధ్యాహ్న కాల ఆరాధన (రెండవ నైవేద్యం), అష్టోత్తర శతనామార్చన ఒంటి గంట వరకు జరుగుతాయి. ఒంటి గంట నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు సర్వ దర్శనం ఉంటుంది. సాయంత్రం మూడో నైవేద్యం, అష్టోత్తర శతనామార్చన ఏడు గంటల వరకు నిర్వహిస్తారు. తరువాత 45 నిమిషాల పాటు సర్వదర్శనం భక్తులకు అవకాశం ఉంటుంది. రాత్రి 8 గంటలకు ఏకాంత సేవతో స్వామి సేవలు ముగుస్తాయి. ప్రతి గురువారం ఉదయం 9 గంటలకు స్వామి నేత్ర దర్శనం, శుక్రవారం అభిషేకం, ఆదివారం గరుడాళ్వార్‌కు అభిషేకం జరుగుతాయి.

నవంబరు, డిసెంబరు, జనవరి నెలలకు సంబంధించి స్వామి హుండీ లెక్కింపు జరిగింది. హుండీ ఆదాయం రూ. 5 లక్షలు వచ్చింది. ప్రతి రోజు స్వామి సేవలకు టీటీడీ ఆలయ అర్చకులను నియమించింది.

మూడు రోజులు అన్నసమారాధన

వారంలో మూడు రోజుల పాటు భక్తుల సహకారంతో ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తున్నాం. పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఆలయ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు స్వచ్ఛందంగా పనులు నిర్వహిస్తున్నాం.

– నల్లమిల్లి వెంకటరామారెడ్డి, ధర్మప్రచార సేవా భక్త మండలి కోఆర్డినేటర్

తిరుమలలో దర్శించుకున్నట్టే..

స్వామి దర్శనం నేత్ర పర్వంగా ఉంది. తిరుపతిలో వేంకటేశ్వరస్వామిని చూసినట్టే ఉంది. కొండల నడుమ ఎంతో సుందరంగా ఆలయాన్ని తీర్చిదిద్దారు. వచ్చిన భక్తులకు అన్న సమారాధన కోసం నా వంతు సహాయం చేస్తున్నాను.

– గురు ప్రసాద్, రాజమహేంద్రవరం

అల్లూరి, గంటందొర విగ్రహాల ఆవిష్కరణ



విగ్రహాలను ఆవిష్కరిస్తున్న తహసీల్దారు పడాల వీరభద్రరావు, సత్యనారాయణ

కొయ్యూరు: మన్యంలో విప్లవానికి ఊపిరి పోసిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, అతని ప్రధాన అనుచరుడు గాం గంటందొర చిరస్మరణీయులని, గిరిజనుల హృదయాల్లో చిరస్థాయిగా కొలువై ఉంటారని తహసీల్దారు సీహెచ్ తిరుమలరావు, జాతీయ అల్లూరి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు, సంఘం అధ్యక్షుడు పి.వి.సత్యనారాయణ అన్నారు. చీడిపాలెం పంచాయతీ కాకరపాడు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన అల్లూరి, గాం గంటందొర విగ్రహాలను సోమవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆ నాయకుల జీవితాలను గిరిజన యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న కాకరపాడు గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సూరిబాబు మాట్లాడుతూ అల్లూరి, గాంగంటందొర విగ్రహాలు ఇక్కడ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈసందర్భంగా తహసీల్దార్‌తో పాటు పలువురిని సన్మానించారు. అల్లూరి యువజన సంఘం ఉపాధ్యక్షుడు రమణ, కోశాధికారి ఎస్.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. మల్లుదొర ముని మునువడు బోడిదొర తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండడంతో యువజన సంఘం సభ్యులు సోమవారం ఆయన స్వగ్రామం లంకవీధి వెళ్లి పరామర్శించారు.

క్లుప్తంగా



చింతపల్లిరూరల్: స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో జరిగిన జాతీయ సదస్సు నేపథ్యంలో ఏర్పాటుచేసిన చిరుధాన్యాల స్టాల్‌ను పరిశీలిస్తున్న వైస్ ఛాన్సలర్లు డాక్టర్ శారధ జయలక్ష్మి దేవి, జానకీరామ్, ప్రశాంత్‌కుమార్

వలంటీర్ల ఔదార్యం



అనాథ మహిళ మృతదేహాన్ని మోస్తున్న గ్రామ వలంటీర్లు

ముంచంగిపుట్టు: గ్రామ వలంటీర్లు మరోసారి వారి సహాయ గుణాన్ని చాటుకున్నారు. కిలగాడ పంచాయతీ కేంద్రం ఉన్న బస్ షెల్టర్ వద్ద మతి స్థిమితం లేని అనాథ మహిళా గత కొన్ని రోజులు ఉంటుంది. సోమవారం ఉదయం ఆ అనాథ మహిళా మృతి చెందింది.దీంతో విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్లు నరసింహమూర్తి, బాబులాల్‌లు, సర్పంచ్ శివశంకర్, పంచాయితీ కార్యదర్శి మహేష్, వీఆర్‌వో సుధారాణి, గ్రామ పెద్దల సహకారంతో మృతదేహాన్ని స్మశాన వాటిక వరకు పాడిపై మోసుకొని వెళ్లి దహన సంస్కరణలు పూర్తి చేశారు.దీంతో వారికి గ్రామస్తులు వలంటీర్ల సేవలను అభినందించారు.

14న జెడ్పీ సర్వసభ్య సమావేశం

మహారాణిపేట(విశాఖ): జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఫిబ్రవరి 14వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈవో ఎం.పోలినాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు విశాఖ జెడ్పీ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశానికి సభ్యులు, ఆహ్వానితులు హాజరు కావాలని పేర్కొన్నారు. సమావేశానికి ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి అన్ని శాఖల జిల్లా అధికారులు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రగతి నివేదికలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని సూచించారు.

ఆదివాసీ చట్టాలపై అవగాహన అవసరం



పాడేరులో మాట్లాడుతున్న విశాఖ సీఐడీ డీఎస్పీ భూపాల్



చింతపల్లిలో మాట్లాడుతున్న ఎంపీపీ అనూషదేవి



జద్దంగిలో మాట్లాడుతున్న సీఐడీ విభాగ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సత్యనారాయణ

పాడేరు : రాజ్యాంగంలో పొందుపరిచిన ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి చట్టంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని విశాఖ సిఐడీ డీఎస్పీ ఎం.నాగేంద్ర భూపాల్ అన్నారు. స్థానిక మండల పరిషత కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి చట్టంపై విద్యార్థులు, పలు సంఘాల నాయకులను అవగాహన కల్పించారు.అయన మాట్లాడుతూ రాజ్యంగంలో ఎస్సీ, ఎస్టీల యొక్క హక్కులు, చట్టాలు రాయితీలు కల్పించారన్నారు. ఈ విషయంపై మారుమూల ప్రాంతాల్లో చాలా మంది ఎస్సీ ,ఎస్టీలకు పూర్తి స్థాయిలో అవగాహన లేనందున ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గిరిజనులందరికి అవగాహన కల్పిస్తామన్నారు. గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు, తహసీల్దార్ వంజంగి త్రినాథనాయుడు, ఎంపీడీవో సాయి నవీన్, ఎస్ఐ లక్ష్మణ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: స్థానిక జద్దంగి పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం ప్రివెన్షన్ ఆఫ్ ఎస్సీ ఎస్టీ అట్రాసిటి అనే అంశంపై సీఐడీ ఇన్‌స్పెక్టర్ జి.వి.వి.సత్యనారాయణ అవగాహన సదస్సు జరిగింది. గిరిజనులు, గిరిజన ప్రతినిధుల సమక్షంలో జరిగిన ఈ సదస్సులో సత్యన్నారాయణ మాట్లాడుతు ప్రతి పౌరుడు ఎస్సీ ఎస్టీ చట్టంపై, గిరిజన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సమ సమాజం కోసం, సహోదర భావం కోసం రూపొందించినదే ఎస్సీ ఎస్టీ చట్టం అన్నారు. నేటికి కొన్ని ప్రాంతాల్లో అణగారిన వర్గల వారు వేధింపులకు గురౌతువున్నారన్నారు. లోదొడ్డి సర్పంచ్ లోతారామారావు మాట్లాడుతు ఏజెన్సీలో 1/70 ఏక్ట్ పగడ్బంధీగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్ వైవీ. సుబ్రహ్మణ్యాచారి, లోతా రామారావు, స్థానిక జెట్పీటీసీ ఒడుగుల జ్యోతి, సర్పంచ్‌లు కొంగర మురళీకృష్ణ, సవిరెల చంద్రుడు, కోండ్ల సూరిబాబు, జద్దంగి ఎస్సై రఘునాధరావు, ఏపీసీఐడీ ఏసీఐ కేవీవీ. శ్రీనివాస్, హెచ్‌సీ సత్యనారాయణ, పెద్ద ఎత్తున పరిసర ప్రాంత ఆదివాసీ ప్రజలు పాల్గొన్నారు.

చింతపల్లిరూరల్: ఆదివాసీ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు పోతురాజు బాలయ్య అన్నారు.మండల సమావేశ మందిరంలో సోమవారం గిరి విద్యార్థులకు ఎస్సీ,ఎస్టీ అట్రాసీటీ కేసులు, చట్టాలు,హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1-70 చట్టం ద్వారా గిరిజన ప్రాంతంలో గిరిజనులకు అన్ని అధికారాలు ఉన్నాయన్నారు.అటవీ ప్రాంత ప్రజలకు ప్రత్యేక షెడ్యూల్ ద్వారా విద్య,వైద్యం,మౌలిక వసతులు కల్పిస్తున్నారన్నారు.ఎస్సీ,ఎస్టీ అట్రాసీటీ కేసులు నీర్వీర్యం కాకుండా కేసులు పెట్టుకోనే వెసులుబాటు కల్పించడం జరిగిందన్నారు. నేర పరిశోధన విభాగం (సిఐడి) సీఐ జె.శ్రీనివాస్, ఎస్ఐ రామారావు, తహసీల్దార్ లత్సపాత్రుడు,స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాత్రుడు, ఎంఈవో వనపల ప్రసాద్, ఎంపీటీసీ జయలక్ష్మి,తదితరులు పాల్గోన్నారు.



అడ్డతీగలలోని అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐటీ సీఐ బాలకృష్ణ

అడ్డతీగల: షెడ్యూల్ల్ తెగల అత్యాచారాల నిరోధక చట్టం గిరిజన జాతుల హక్కులను రక్షిస్తుందని సిఐడి రాజమహేంద్రవరం ఇన్‌స్పెక్టర్ ఎన్.బాలకృష్ణ అన్నారు.షెడ్యూల్డ్ తెగల హక్కులు,చట్టాలపై అడ్డతీగలలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం గిరిజన ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా సిఐడి సిఐ బాలకృష్ణ మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం ప్రత్యేక చట్టాలు అమలులో ఉన్నాయన్నారు. ఆదిమజాతుల జీవనయానం కోసం ఈ చట్టాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గిరిజనులు ఏదైనా అంశంలో ఇబ్బందులు ఎదుర్కొంటే చట్టపరంగా తగిన న్యాయం చేయడానికి ముందుంటామని ఎస్ఐ అప్పలరాజు అన్నారు. అడ్డతీగల సర్పంచ్ పప్పుల చిట్టమ్మ, ఈవోపీర్డీ చిన్నబాబు, గిరిజన సంక్షేమ సాంస్కృతిక సంఘం మండల కార్యదర్శి కృష్ణ, సీఐడీ ఎస్ఐ రవికుమార్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీవోను కలిసిన గిరిజన విద్యార్థులు

రంపచోడవరం: ఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న గిరిజన విద్యార్థులను ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే అభినందించారు. రిపబ్లిక్ వేడుకల్లో పాల్గొన్న పీడీలు, గిరిజన విద్యార్థులు సోమవారం పీవోను కలిశారు. పీవో సూరజ్ గనోరే మాట్లాడుతూ రంపచోడవరం ఐటీడీఏ నుంచి నలుగురు విద్యార్థులు, చింతూరు ఐటీడీఏ నుంచి ఇద్దరు విద్యార్థులు ఢిల్లీ వెళ్లినట్లు తెలిపారు.

ఏపీ నుంచి 15 మంది బాలికలు, 15 బాలురు గిరిజన సంక్షేమశాఖకు సంబంధించిన మోట ఆధ్వర్యంలో రిపబ్లిక్‌డే వేడుకలకు వెళ్లడం జరిగిందన్నారు. వీరంతా పీఎం మోదీని కలిశారని తెలిపారు. మోటా సహకారంతో ఢిల్లీలోని వివిధ ముఖ్యమైన ప్రదేశాలను విద్యార్థులు సందర్శించారని తెలిపారు. పీవోను కలిసిన వారిలో డీడీ అబ్బులం, పీడీలు కె.తిరుపతిరావు, కె రామాయమ్మ, వార్డెన్ ఆదినారాయణరెడ్డి, పీఈటీ మల్లేశ్వరి తదితరులు ఉన్నారు.



పీవోను కలిసిన గిరిజన విద్యార్థులు, పీడీలు

ఇసుక ట్రాక్టరు సీజ్..

కోటవురట్ల: అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఎస్ఐ రమణయ్య తెలిపిన వివరాల ప్రకారం రాజుపేట శివారు రామన్నపాలెం వద్ద ట్రాక్టర్‌లో తరలిపోతున్న ఇసుకను సోమవారం పట్టుకున్నారు. ఇసుక తరలింపుకు సంబంధించి ఎటువంటి బిల్లులు లేకపోవడంతో ట్రాక్టరును సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. రూ.10 వేలు అపరాధ రుసుము విధించారు.

1 నుంచి వైజాగ్ ఫార్మా ఎక్స్‌పో



మాట్లాడుతున్న సుబ్బారావు

పరవాడ: విశాఖ జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో వచ్చే నెల 1, 2, 3 తేదీల్లో ఫార్మా ల్యాబ్ కెమికల్ ఎక్స్‌పో నిర్వహించనున్నామని మ్యూచువల్ ఎయిడెడ్ సొసైటీ ఫర్ రిస్క్ మిటిగేషన్ (ఎంఏఎస్ఆర్ఎం) కార్యదర్శి, సియాంక, ఔషధ పరిశ్రమ ఎండీ జెట్టి సుబ్బారావు చెప్పారు. జేఎన్‌పీసీ మ్యానుఫ్యాక్చరీస్ అసోసియేషన్ భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ ఎగ్జిబిషన్‌లో 125 జాతీయ, అంతర్జాతీయ ఔషధ పరిశ్రమలతో పాటు జిల్లాలోని వివిధ ఔషధ పరిశ్రమల యాజమాన్యాలు కూడా పాల్గొంటాయన్నారు. ఔషధ పరిశ్రమలకు సంబంధించిన ఉత్పత్తులను ఎగ్జిబిషన్‌లో ప్రదర్శనకు ఉంచుతారన్నారు. యాజమాన్యాలు తమ ఆర్డర్లను బుక్ చేసుకొనే అవకాశం ఉంటుందని చెప్పారు.

సారా, మద్యం స్వాధీనం: నలుగురి అరెస్టు



హుకుంపేటలో సారా, మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులో తీసుకున్న పోలీసులు



ముంచంగిపుట్టులో సారా అమ్ముతూ అరెస్టు అయిన వ్యక్తులతో పోలీసులు

హుకుంపేట: సారా, మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తులను పట్టుకుని అరెస్టు చేసినట్టు ఎస్ఐ సతీష్ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బి.బొడ్డాపుట్టు పంచాయతీ దబ్బగరువు గ్రామంలో సారా, మద్యం అక్రమ విక్రయాలు చేస్తున్నట్టు అందిన సమాచారం మేరకు గ్రామంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సారా, మద్యం అక్రమంగా విక్రయిస్తున్న కొర్ర ఈశ్వరరావు, కొర్ర చిన్నదొన్నన్న నుంచి 45 లీటర్ల సారా, మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ సతీష్ చెప్పారు. గ్రామాల్లో సారా, మద్యం అక్రమ విక్రయాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముంచంగిపుట్టు: మండలంలో గల కిలగాడ పంచాయతీ కేంద్రంలో సారాను విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ రవీంద్ర తెలిపారు.కిలగాడలో సారా అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు చేయగా తలారి బాలరాజు, కొమ్ము సన్యాసయ్యలు సారాను విక్రయిస్తూ పట్టుబడ్డరన్నారు. వారిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 4లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని, ఇద్దరిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

వేర్వేరు ప్రాంతాల్లో 145 కిలోల గంజాయి స్వాధీనం



సింధుగులలో గంజాయి, నిందితుడితో ఎస్ఐ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది



జి.ఎం కొత్తూరు జంక్షన్‌లో పట్టుబడిన గంజాయి, రెండు బైకులతో ఎస్ఐ శ్రీనివాస్, పోలీసులు

నలుగురు నిందితుల అరెస్టు

జి.మాడుగుల: మండలంలో వేర్వేరు ప్రాంతాల్లో 145 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురి నిందితులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఎస్ఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. మండలంలో పెదలోచలి పంచాయతీ సింధుగుల గ్రామంలో గెమ్మెలి చిరంజీవి అనే గిరిజనుడు ఇంట్లో గంజాయి ఉందని సమాచారం అందడంతో పోలీసులు వెళ్లి సోదా చేయగా, 130 కిలోలు గంజాయి, ఒకరిని అరెస్టు చేశారు. పాడేరు మార్గంలో జి.ఎం కొత్తూరు జంక్షన్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా, రెండు ద్విచక్ర వాహనాలపై రెండు గోనె సంచులతో 15 కిలోల గంజాయిని మైదాన ప్రాంతానికి తరలిస్తున్న ముగ్గురు నిందితులను పట్టుకున్నారు. వీరిలో పెదబయలు మండలం కుంతుర్ల పంచాయతీ కొండెములు గ్రామానికి చెందిన గూడ బంగారురాజు, మరో బాలుడు, తూలం గ్రామానికి చెందిన తెరవాడ హనుమంతరావు ఉన్నారు. రెండు బైకులను స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్టు చేశారు. వీరిని పాడేరు కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాడేరు విద్యార్థికి బంగారు పతకం

పాడేరు : సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీల్లో పాడేరు జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థి సత్తా చాటాడు. కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ చదువుతున్న పాంగి రామారావు హైజంప్ పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించాడు. రామారావును సోమవారం కళాశాలలో ప్రిన్సిపాల్ కె.సుజాత, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.



బంగారు పతకం సాధించిన రామారావును అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ సుజాత

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



లక్ష్మీపురంలో గిరిజనులతో మాట్లాడుతున్న సీఐ రమేష్



పలకజీడిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ వెంకటరమణ, పక్కన ఎస్ఐలు లోకేష్‌కుమార్, దేవుడు

ముంచంగిపుట్టు: ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు గిరిజనులు సహకరించాలని సీఐ రమేష్ అన్నారు. .మండలంలోని మూరుమూల లక్ష్మీపురం పంచాయతీ కేంద్రంలో సోమవారం లక్ష్మీపురం, బుంగాపుట్టు పంచాయితీల గిరిజనులు, సర్పంచులతో సీఐ సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ రమేష్ మాట్లాడుతూ గంజాయికి దూరంగా ఉండాలని, దీని వల్ల గిరిజన యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందన్నారు. గంజాయి వల్ల గిరిజన యువతకు తీరని నష్టం జరుగుతుందన్నారు. గంజాయి సాగు, రవాణా, సారా తయారీ, అమ్మకాలు చేస్తే చర్యలు తప్పవన్నారు. గిరిజన రైతులు గంజాయి సాగును విడనాడి వాణిజ్య పంటలపై దృష్టి సారించాలన్నారు. ఎస్ఐ రవీంద్ర గిరిజనులపై దాడులు చేస్తున్నట్టు ఇటీవల స్థానికులు చేపట్టిన ఆందోళనపై విచారణ చేస్తామన్నారు. మండలంలో గల లబ్బూరు,మాకవరం,పనసపుట్టు గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను సీఐ రమేష్ పరిశీలించారు.రానున్న ఎన్నికల్లో సౌకర్యాలపై ఉపాధ్యాయులు, గ్రామస్తులతో మాట్లాడారూ. గతంతో ఎన్నికల సమయంలో నెలకొన్న పరిస్థితులపై ఆరా తీశారు.

కొయ్యూరు: త్వరలో జరగనున్న ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కొయ్యూరు సీఐ పి.వెంకటరమణ,మంప ఎస్ఐ లోకేష్‌కుమార్,అదనపు ఎస్ఐ దేవుడు కోరారు. వారు సోమవారం యూ చీడిపాలెం పంచాయతీలో పలకజీడి, యూ.చీడిపాలెంతో పాటు పలు గ్రామాలను సందర్శించారు. వారు మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరగాలంటే ప్రజల సాయం, సహకారం ఉండాలన్నారు. ఎన్నికల సమయంలో వివాదాలకు దూరంగా ఉండాలని సూచించారు.సైబర్ క్రైమ్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్ రుణాల యాప్‌లతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాహనాలను నడిపేటప్పుడు నిబంధనలు పాటించాలన్నారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు.

ప్రకృతిహితం ఆదివాసీల అభిమతం

- లాభాపేక్ష రహిత జీవనం ఆదివాసీల సొంతం
- నన్నయ్య వర్సిటీ మాజీ వీసీ ఆచార్య ముత్యాలనాయుడు



సదస్సును ప్రారంభిస్తున్న ఆచార్య ముత్యాలనాయుడు

ఏయూ క్యాంపస్: ప్రకృతిహితం జీవనం ఆదివాసీల అభిమతమని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య ఎం.ముత్యాలనాయుడు అన్నారు. సోమవారం ఏయూ టీఎల్ఎన్ సభా మందిరంలో ఏయూ అణుభౌతిక శాస్త్ర విభాగం, వనవాసి కల్యాణ ఆశ్రమం సంయుక్తంగా నిర్వహించిన ట్రైబల్ హెరిటేజ్ ఇన్ ఈస్టర్న్ ఘాట్స్ ఒక రోజు సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఆదివాసీ జాతుల్లో వైవిధ్యత ఉన్నప్పటికీ వారు పరస్పరం గౌరవించుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. లింగ వివక్షత లేకుండా, వృద్ధులను, అనుభవజ్ఞులను గౌరవించడం వారి నుంచి నేర్చుకోవాలన్నారు. వారిలో లాభాపేక్ష అనేది ఎన్నడూ కనిపించదన్నారు. ఇన్ని మంచి లక్షణాలు కలిగిన ఆదివాసీలు మనకన్నా ఎంతో ఉన్నతులని ఆయన అభిప్రాయపడ్డారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ సహజత్వం అనేది కేవలం ఆదివాసీలలోనే కనిపిస్తుందన్నారు. ఆధునికత ఎంత పెరిగినా మన సంస్కృతులను మరువరాదన్నారు. ఆదివాసీ సంస్కృతిని, వారి జీవనాన్ని తెలయజేసే ఇటువంటి సదస్సుల నిర్వహణకు వర్సిటీపరంగా సహకారం అందిస్తామన్నారు. ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవవైవిధ్య పరిరక్షకులుగా ఆదివాసీలు నిలుస్తున్నారన్నారు. దేశాభివృద్ధిలో ఆదివాసీలు ముఖ్య పాత్ర పోషిస్తున్నారన్నారు. ఏయూ న్యూక్లియర్ ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ పి.వి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మానవతా విలువలు ఎంతో ప్రధానమని, ఇవి ఆదివాసీలు సొంతమన్నారు. ప్రకృతితో మమేకమై జీవించే గుణం వారి నుంచి మనం నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శక్తి డైరెక్టర్ డాక్టర్ పి.శివరామకృష్ణ, డాక్టర్ పి.శంకరరావు, శ్యాంప్రసాద్, ఏయూ మాజీ వీసీ ఆచార్య కె.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇగ్నో ప్రవేశాలకు రేపటితో గడువు పూర్తి

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2024 విద్యా సంవత్సరం ప్రవేశాలకు బుధవారంతో గడువు ముగియనుందని విశాఖ ప్రాంతీయ కేంద్రం అధికారులు తెలిపారు. ఇగ్నో ద్వారా అందిస్తున్న డిగ్రీ, పీజీ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ప్రవేశాలు జరగనున్నాయి. కేంద్రం పరిధిలోని 11 జిల్లాల విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. https://ignouadmission.samarth. edu.in/ వెబ్‌సైట్ ద్వారా అర్హులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్లాంట్ డాక్టర్స్ డైరీ ఆవిష్కరణ

సాక్షి,పాడేరు: వ్యవసాయశాఖ రూపొందించిన ప్లాంట్ డాక్టర్స్ 2014 డైరీని కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన చిరుధాన్యాలతో 100 రకాల రుచికరమైన వంటకాల పుస్తకం, వ్యవసాయాధికారుల క్యాలెండర్‌లను ఆయన విడుదల చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిరుధాన్యాలతో వంటల తయారీ పుస్తకంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. చిరుధాన్యాలలో పోషక విలువలు అధికంగా ఉంటాయని, వాటి వినియోగంతో ఆరోగ్యకరంగా జీవించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్.నందు,ఏడీలు జాహ్నవి, మోహనరావు, వ్యవసాయాధికారుల సంఘం కార్యదర్శి లకే రవీంద్రపాత్రుడు, ఉపాధ్యక్షుడు మధు, పలు మండలాల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు,



డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, వ్యవసాయ అధికారులు

వాలీబాల్ పోటీల్లో క్రీడా పాఠశాల పూర్వ విద్యార్థుల ప్రతిభ

అరకులోయటౌన్: తమిళనాడు రాష్ట్రంలో ఈనెల 24 నుంచి 28 వరకు జరిగిన ఖేలో ఇండియా జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున పాల్గొన్న స్థానిక క్రీడా పాఠశాల పూర్వ విద్యార్థులు సత్తాచాటారు. శెట్టి కనిష్క, కొర్రా ప్రవీణ్, కొర్రా నాగరాజు, కొర్రా సంతోష్, పూసం సాహితీచంద్ ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ పి.ఎస్.ఎన్ మూర్తి సోమవారం విలేకరులకు తెలిపారు. రాష్ట్ర జట్టు తృతీయస్థానంలోని నిలిచినట్టు చెప్పారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులను అభినందించారు. కోచ్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీల్లో సత్తాను చాటిన విద్యార్థులు

పార్టీ విజయానికి సమష్టిగా కృషి

అడ్డతీగల: వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్ సమన్వయకర్త ప్రస్తుత పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ళ భాగ్యలక్ష్మి సోమవారం రాత్రి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మిని, ఎమ్మెల్సీ అనంతబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఎల్లవరంలోని ఎమ్మెల్సీ అనంతబాబు కార్యాలయంలో ఇరువురు నేతలను భాగ్యలక్ష్మి కలిశారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి సమిష్టిగా కృషి చేసి మరలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో సంక్షేమ సర్కారుని తెచ్చుకోవాలని నేతలు నిర్ణయించారు. రంపచోడవరం నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. కొయ్యూరు ఎంపీపీ బడుగు రమేష్, కొయ్యూరు మండల పార్టీ అధ్యక్షులు జల్లి బాబులు, జేసీఎస్ కన్వీనర్ సుధాకర్, నాయకులు సత్తిబాబు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబుని కలిసిన అరకు పార్లమెంట్ సమన్వయకర్త భాగ్యలక్ష్మి

బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

విశాఖ స్పోర్ట్స్: బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) విశాఖ ఆధ్వర్యంలో బాల్ బ్యాడ్మింటన్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. అనువిహార్‌లోని జీసీఎస్ పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్న పోటీల్లో ఎనిమిది జట్లు పోటీపడుతున్నాయి. ఫిబ్రవరి రెండో తేదీతో ముగియనున్న ఈ పోటీల్లో అటామిక్ అనర్జీ విభాగాలకు చెందిన అజంతా, ద్వారకా, ఎల్లోరా, గో ల్కొండ, పుష్కర్, రామేశ్వరం, కో ణార్కలతో పాటు నాగార్జున జట్లు తలపడనున్నాయి. ద్వారక-గోల్కొండ జట్ల మధ్య పోటీతో టోర్నీ ప్రారంభమైంది. పోటీల ప్రారంభం కార్య క్రమంలో బార్క్ సైంటిస్ట్, ప్రాజెక్స్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ఎస్‌వో ఎంవీ సూర్యనారాయణ, బాల్‌బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు వెంకట్రావు, ప్రభుజీ పాల్గొన్నారు.



పోటీల్లో తలపడుతున్న జట్లు